'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 74 | గురువారం | 29.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 74 | Thursday | 29.10.2026 | Pages: 8 | Rate: 2



క్యాన్సర్ పేషంట్లకు గుడ్ న్యూస్

భారీగా తగ్గనున్న మందుల ధరలు
543 బ్రాండ్లపై భారీ తగ్గుదల
నవంబర్ 9 నుంచి కొత్త రేట్లు అమలు

2లో..



3లో..

బ్యాలెట్ పేపర్లలోనూ సున్నా!

4 రాష్ట్రాల్లో ఘోర పరాజయం
కాంగ్రెస్‌పై మోదీ వ్యంగ్యాస్త్రాలు



3లో..

సీఈసీపై విపక్షాల బహిరంగ అభిశంసన!

ఖర్గే నివాసంలో అక్టోబర్ 30న కార్యక్రమం



3లో..

ఇండియా కూటమికి సీజేపీ మద్దతు

నవంబర్ 1 ర్యాలీకి కాక్రోచ్ జనతా పార్టీ జై
ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యమన్న దిప్కే



7లో..

ఇజ్రాయెల్‌లో హంగు నెతన్యాహు ఖంగు

ఏ పార్టీకి దక్కని మెజారిటీ
ప్రభుత్వ ఏర్పాటుపై కనిపించని క్లారిటీ
లికుడ్‌కు బ్యాడ్ లక్
అధికార పార్టీకి ఓటర్లు చెక్

ఒకవైపు సుదీర్ఘ రాజకీయ అనుభవం, మరోవైపు మార్పు కోసం ప్రతిపక్షం పోరాటం! మధ్యలో అరబ్ ఓట్ల ప్రభావం.. చుట్టూ యుద్ధ భయాలు, ఆర్థిక ఒత్తిళ్లు, అంతర్జాతీయ రాజకీయాలు! ఇజ్రాయెల్ ఎన్నికలు ఇప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని కూటమి ముందంజలో ఉన్నా.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన 61 స్థానాల మద్దతు లభిస్తుందా? ఇదే అసలు ప్రశ్న! లికుడ్ అతి పెద్ద పార్టీగా నిలవడం ఆయనకు ఊరటనిచ్చినా, మెజారిటీ లెక్కలు మాత్రం కొత్త చిక్కులు సృష్టిస్తున్నాయి. మరోవైపు గాది ఐసెన్‌కాట్ నేతృత్వంలోని ప్రతిపక్షం అధికార మార్పు కోసం ప్రయత్నిస్తోంది. కానీ పార్టీల మధ్య విభేదాలు, అరబ్ పార్టీలతో కలిసి పనిచేయడంపై అభ్యంతరాలు ఆ శిబిరానికి సవాలుగా మారాయి. అమెరికా మద్దతు, ఇరాన్‌తో ఉద్రిక్తతలు, గాజా యుద్ధం.. ఓటర్ల నిర్ణయంపై వీటి ప్రభావం ఎంత? ప్రజల భద్రత, జీవన వ్యయం, ప్రభుత్వంపై విశ్వాసం.. ఎవరి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి? నెతన్యాహు మళ్లీ పగ్గాలు చేపడతారా? ఐసెన్‌కాట్‌కు అవకాశం దక్కుతుందా? లేక కూటముల ప్రతిష్టంభన ఇజ్రాయెల్‌ను మరో ఎన్నిక వైపు నడిపిస్తుందా? ఓట్ల లెక్కల నుంచి అధికార పోరు వరకు.. ఇజ్రాయెల్ రాజకీయాల్లో అసలు మలుపు ఏమిటి?



3లో..

మ్యూజిక్ హక్కుల గోలేంటి..?

» ఇళయరాజా అభ్యంతరాలు ఎందుకు?
» గరివిడి లక్ష్మి ఆరోపణల్లో నిజమెంత?
» పాట ఎవరిది.. హక్కులు ఎవరికి?
» జానపదం నుంచి కోర్టు వరకు పోరాటం!

ఒక పాట పుడుతుంది.. కోట్లాది హృదయాలను గెలుస్తుంది! తరతరాలుగా ప్రజల నాలుకలపై నడిచే జానపదం వెండితెరపై మెరిస్తుంది. కానీ ఆ పాట వెనుక అసలు సృజనకర్త ఎవరు? దాని ద్వారా వచ్చే ఆదాయం ఎవరికి చెందాలి? గుర్తింపు పొందాల్సిన కళాకారుడికి అన్యాయం జరిగితే అడిగేదెవరు? ఇప్పుడు ఈ ప్రశ్నలే సంగీత ప్రపంచాన్ని కుదిపేస్తున్నాయి. గరివిడి లక్ష్మి ఆవేదన ఒకవైపు.. ఆమె ఆరోపణలను ఖండిస్తున్న సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ వాదన మరోవైపు! ఇంతలోనే దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజా, సరిగమా మధ్య కాపీరైట్ పోరు కోర్టుల గడప తొక్కింది. సంగీత రచన ఒకరిది.. అసలు రికార్డింగ్ హక్కులు మరొకరివా? జానపద బాణీ ప్రజల సంపదా? దానికి కొత్త రూపమిచ్చిన కళాకారుడి హక్కుల సంగతేంటి? డిజిటల్ యుగంలో పాత పాటలే కోట్ల రూపాయల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న వేళ ఈ ప్రశ్నలకు ప్రాధాన్యం మరింత పెరిగింది. ఆరోపణలు నిజాలవుతాయా? ఒప్పందాలు ఎవరికి అండగా నిలుస్తాయి? బయోపిక్‌లో కనిపించినదంతా వాస్తవమేనా? పాట వెనుక దాగిన హక్కుల లెక్కలు.. కళాకారుల ఆవేదన.. కోర్టుల కీలక పరిశీలనలు! అసలు వివాదం ఏమిటి? న్యాయం ఎవరి పక్షాన నిలుస్తుంది?

రాజధానికి నీటి ముప్పు పొంచి ఉందా?



వివరాలు5లో..

- తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు
- శుద్ధి చేసిన నీటితో తాగునీటికి భరోసా లభిస్తోందా!
- తాగునీటి భద్రతకు రేవంత్ సర్కారు చర్యలు వరోటయ్యేనా?
- నీటి గండం తప్పించేందుకు సర్కారు ప్లాన్ ఫలిస్తుందా?

హైదరాబాద్ మహానగరానికి నీటి ముప్పు పొంచి ఉందా? రేపటి అవసరాల కోసం ఇప్పుడే ప్రభుత్వం అప్రమత్తమవుతోందా? పెరుగుతున్న జనాభా.. విస్తరిస్తున్న నిర్మాణాలు.. అంతకంతకూ పెరుగుతున్న నీటి వినియోగం.. మారుతున్న వాతావరణ పరిస్థితులు.. ఇవన్నీ నగర నీటి భద్రతపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశాలను దృష్టిలో పెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయాలకు సిద్ధమైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ హైదరాబాద్‌లో తాగునీటి సమస్య తలెత్తకూడదని సీఎం స్పష్టం చేయడం వెనుక భవిష్యత్తు అవసరాలపై ముందస్తు ప్రణాళిక కనిపిస్తోంది. రిజర్వాయర్లలో నీటి నిల్వలపై నిరంతర పర్యవేక్షణ.. మురుగునీటి శుద్ధి కేంద్రాలకు వంద శాతం సామర్థ్య లక్ష్యం.. భవన నిర్మాణాల నుంచి ప్రభుత్వ కార్యాలయాల వరకు శుద్ధి చేసిన నీటి వినియోగం తప్పనిసరి చేసే దిశగా అడుగులు.. ట్యాంకర్ల ట్రాకింగ్‌తో ప్రత్యేక పర్యవేక్షణ.. నవంబర్ 1 నుంచి కొత్త ఆదేశాల అమలుకు సన్నాహాలు.. ఇలా ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేస్తోంది. అసలు హైదరాబాద్ నీటి నిర్వహణలో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులేమిటి? తాగునీటి వృథాను అడ్డుకునేందుకు ఎలాంటి ఆంక్షలు రానున్నాయి? ఈ ప్రణాళికలు నగర భవిష్యత్తుకు ఎంతవరకు భరోసా ఇస్తాయి? నీటి ప్రతి చుక్క విలువైన ఈ తరుణంలో.. హైదరాబాద్ నీటి భద్రతకు ప్రభుత్వం వేస్తున్న అడుగులపై ప్రత్యేక కథనం!

హైదరాబాద్‌లో తాగునీటి కొరతకు చెక్!

తాగునీటి సరఫరాపై నిరంతర నిఘా
ఎస్టీపీలపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో క్యూర్ ఏరియాలో తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీలు) పనితీరుపై సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, క్యూర్ పరిధిలోని ఎస్టీపీలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)





ఎల్‌నినో ముప్పుపై సర్కార్ కసరత్తు!

• కరువు నివారణకు అఖిలపక్ష కార్యాచరణ • అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్ష బృందం
• కేంద్రానికి నివేదిక: డిప్యూటీ సీఎం భట్టి

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కరువు పరిస్థితులపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని, అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధులతో ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి రావాల్సిన సహాయాన్ని కోరుతామని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా, రైతుల సమస్యలపై చర్చించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలని భట్టి పిలుపునిచ్చారు. (వివరాలు 2లో..)

ఎల్‌నినోపై అఖిలపక్షంలో బీఆర్ఎస్ ప్రశ్నలు

నీటి నిర్వహణలో విఫలమంటూ విమర్శలు


ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ నీటి నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తాగునీరు, విద్యుత్, వ్యవసాయ రంగాలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నుంచి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎల్.రమణ, బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి సమావేశానికి రాకపోవడంపై నిరంజన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా హాజరై పరిస్థితులపై వివరణ ఇవ్వాల్సిందని అన్నారు. ప్రభుత్వ ముందుచూపు లోపం వల్లే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, కృష్ణా, గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. (వివరాలు 2లో..)



మూసీపై ప్రశ్నిస్తే అరెస్టులా?

నేతల నిర్బంధంపై హరీశ్‌రావు ఆగ్రహం

మూసీ ప్రక్షాళనపై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం, ఇతర బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డితో పాటు ఇతర నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. (వివరాలు 2లో..)



మూసీ ప్రక్షాళన ముసుగులో మెగా దోపిడీ?

ప్రజాభిప్రాయ సేకరణపై బీఆర్ఎస్ అభ్యంతరాలు

మూసీ ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. మూసీ పునరుద్ధరణకు తాము వ్యతిరేకం కాదని, దాని పేరుతో పేదల ఇళ్లను తొలగించడం, భారీ వ్యయంతో ప్రాజెక్టు చేపట్టడాన్ని ప్రశ్నిస్తున్నామని స్పష్టం చేశారు.





ఓటర్ల ఫారాలపై ఈసీకి షాక్!

పాత ఓటర్లకు కొత్త దరఖాస్తులెందుకు?
నిబంధనలు మార్చొద్దన్న సుప్రీం కోర్టు

ఢిల్లీలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై విచారణ సందర్భంగా భారత ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారి పేర్లు తిరిగి చేర్చేందుకు కొత్త ఓటర్ల నమోదు కోసం ఉద్దేశించిన ఫామ్ 6 ఎందుకు సమర్పించాలంటూ ప్రశ్నించింది. (వివరాలు 2లో..)



బీఆర్ఎస్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కుందా?

ధర్నా చౌక్ ఎత్తేసినవారే ఇప్పుడు నీతులు చెబుతున్నారు?
మంత్రి పొంగులేటి విమర్శలు

ప్రజాస్వామ్యం, నిరసన హక్కుల గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు గతంలో తమ పాలనలో అనుసరించిన విధానాలను గుర్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హితవు పలికారు. ఇందిరాపార్క్‌లో ధర్నా చౌక్‌ను తొలగించి ప్రజల నిరసనలకు అవకాశం లేకుండా చేసినవారే ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నా చౌక్‌ను పునరుద్ధరించి, ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. (వివరాలు 2లో..)

ఎల్‌నినోపై అఖిలపక్షంలో బీఆర్ఎస్ ప్రశ్నలు

నీటి నిర్వహణలో విఫలమంటూ విమర్శలు

ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ నీటి నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తాగునీరు, విద్యుత్, వ్యవసాయ రంగాలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నుంచి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎల్.రమణ, బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి సమావేశానికి రాకపోవడంపై నిరంజన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా హాజరై పరిస్థితులపై వివరణ ఇవ్వాల్సిందని అన్నారు. ప్రభుత్వ ముందుచూపు లోపం వల్లే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, కృష్ణా, గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు.

వృథాగా పోతున్న నీటిపై నిలదీత

అఖిలపక్ష సమావేశం తూతూ మంత్రంగా సాగిందని బీఆర్ఎస్ నేత ఎల్.రమణ విమర్శించారు. నీటిని నిల్వ చేసుకునే చర్యలు చేపట్టకపోవడంతో విలువైన జలాలు వృథాగా పోయాయని పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వం చేపట్టే సానుకూల చర్యలకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువు పరిస్థితులు కరోనా సంక్షోభం కంటే ప్రమాదకరంగా మారవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో 750 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు ఏపీకి వెళ్లాయని, 250 టీఎంసీల కృష్ణా జలాలు కుప్పం వైపు వెళ్లాయని పేర్కొన్నారు. నీటి లభ్యత, నిల్వలపై ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించాలని బీఆర్ఎస్ నేతలు సూచించారు.



మూసీ ప్రక్షాళన ముసుగులో మెగా దోపిడీ?

ప్రజాభిప్రాయ సేకరణపై బీఆర్ఎస్ అభ్యంతరాలు

మూసీ ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. మూసీ పునరుద్ధరణకు తాము వ్యతిరేకం కాదని, దాని పేరుతో పేదల ఇళ్లను తొలగించడం, భారీ వ్యయంతో ప్రాజెక్టు చేపట్టడాన్ని ప్రశ్నిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన తమను అడ్డుకుని అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యహక్కులనుహరించడమేనని విమర్శించారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ.25 వేల కోట్లతో మూసీ ప్రక్షాళనకు ప్రణాళిక రూపొందించిందని, బఫర్ జోన్‌లో ఉన్న పేదల ఇళ్లను కూల్చకుండా ప్రత్యామ్నాయంగా ఎలివేటెడ్ కారిడార్‌ను పరిశీలించిందని తెలిపారు. ఇప్పుడు ప్రాజెక్టు వ్యయం రూ.50 వేల కోట్ల నుంచి రూ.1.50 లక్షల కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. 50 మీటర్ల బఫర్ జోన్‌ను 500 మీటర్లకు ఎందుకు పెంచారు? సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) లేకుండా టెండర్లు ఎలా పిలుస్తారు? అని నిలదీశారు.

కరువు వేళ కోట్ల ఖర్చు అవసరమా?

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు, తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్న సమయంలో మూసీ సుందరీకరణకు వేల కోట్లు ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. డీపీఆర్, సామాజిక, పర్యావరణ ప్రభావాల అంచనాలు లేకుండానే ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ద్వారా రూ.7,345 కోట్ల రుణం తీసుకుని గ్లోబల్ టెండర్లు పిలవడం పారదర్శకతపై సందేహాలు కలిగిస్తోందని ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణను స్వేచ్ఛగా నిర్వహించకుండా స్థానిక ఎమ్మెల్యేను, బాధితులను అడ్డుకున్నారని విమర్శించారు. మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తెస్తామని చెబుతున్న ప్రభుత్వం, ప్రజల తాగునీటి అవసరాలకు ఎలా భరోసా ఇస్తుందో వివరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, వృద్ధుల పింఛన్ల వంటి అంశాలపై దృష్టి పెట్టకుండా భారీ ప్రాజెక్టు చేపట్టడాన్ని తప్పుబట్టారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లకు నష్టం కలిగించే చర్యలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని, ప్రాజెక్టు పూర్తి వివరాలను ప్రజల ముందుంచి పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని కోరారు.



మూసీపై ప్రశ్నిస్తే అరెస్టులా?

నేతల నిర్బంధంపై హరీశ్‌రావు ఆగ్రహం

మూసీ ప్రక్షాళనపై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం, ఇతర బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డితో పాటు ఇతర నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతులను వదిలేసి లక్షన్నర కోట్లా?

రాష్ట్రంలో కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. మూసీ ప్రక్షాళన పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం వెనుక ప్రభుత్వ ప్రాధాన్యాలపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. కరువు బాధిత రైతులకు అండగా నిలవడంలో చూపని శ్రద్ధ, కమిషన్లు దండుకోవడంలో చూపుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా భారీ వ్యయంతో కూడిన ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేయాలని చూడటం సరికాదన్నారు.

పోలీసులతో గొంతు నొక్కలేరు!

ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు ఎంతకాలం నొక్కుతారని హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన పేరుతో జరుగుతున్న దోపిడీ ప్రయత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ వాదిస్తోంది.



హైదరాబాద్‌లో తాగునీటి కొరతకు చెక్!

- తాగునీటి సరఫరాపై నిరంతర నిఘా
- ఎస్టీపీలపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో క్యూర్ ఏరియాలో తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీలు) పనితీరుపై సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, క్యూర్ పరిధిలోని ఎస్టీపీలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని స్పష్టం చేశారు.

నిర్మాణాలకు శుద్ధి చేసిన నీరే వాడాలి

శుద్ధి చేసిన మురుగునీటిని సచివాలయం, సీఎంవో, జెటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు సంస్థల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు వినియోగించాలని సీఎం సూచించారు. పార్కులు, రోడ్ల శుభ్రతతో పాటు భవన నిర్మాణాల్లోనూ శుద్ధి చేసిన నీటిని ఉపయోగించే నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకు సైతం శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ప్లాంట్ల నిర్వహణకు సౌర విద్యుత్ వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు.

నవంబర్ 1 నుంచి కొత్త మార్గదర్శకాలు

ప్రతి ఎస్టీపీ వద్ద ప్రత్యేక అధికారిని నియమించి, అన్ని కేంద్రాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. ప్లాంట్ల పనితీరును హైడ్రా నిరంతరం పర్యవేక్షించాలని, శుద్ధి చేసిన నీటిని తరలించే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. నవంబర్ 1 నుంచి ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగంపై ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల నుంచి గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేస్తున్నామని, వినియోగదారుల నుంచి రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేస్తున్నామని జలమండలి అధికారులు సీఎంకు వివరించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ముప్పుపై సర్కార్ కసరత్తు!

- కరువు నివారణకు అఖిలపక్ష కార్యాచరణ
- అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్ష బృందం
- కేంద్రానికి నివేదిక: డిప్యూటీ సీఎం భట్టి



ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కరువు పరిస్థితులపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని, అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధులతో ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి రావాల్సిన సహాయాన్ని కోరుతామని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా, రైతుల సమస్యలపై చర్చించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలని భట్టి పిలుపునిచ్చారు.

నీటి వనరుల వినియోగంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంతోపాటు పొరుగు ప్రాంతాల్లోనూ వర్షపాతం లోటు ఏర్పడే పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని భట్టి పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రాజెక్టులకు నీరు చేరే అవకాశాలు తగ్గితే జలవనరుల నిర్వహణ కీలకమవుతుందని వివరించారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని, పశువులకు నీరు, మేత అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. శాస్త్రవేత్తలు, నిపుణుల సూచనలతో పాటు అఖిలపక్ష నేతల అభిప్రాయాలను కార్యాచరణలో భాగం చేస్తామని చెప్పారు.

రైతులకు అండగా నిలిచేలా ప్రణాళికలు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని తెలిపారు. అంతర్రాష్ట్ర నదీజలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలతో పాటు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, సాగునీటి అవసరాలు, విద్యుత్ పంపిణీ, ప్రత్యామ్నాయపంటలప్రణాళికలపైసమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. వివిధ పార్టీల నేతలు తెలిపిన సమస్యలు, సూచనలను పరిశీలించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కరువు ప్రభావాన్ని తగ్గించడం, రైతులకు నష్టం జరగకుండా చూడడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని తెలిపారు.

అఖిలపక్ష సహకారంతో సమష్టి పోరాటం

సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ, సీపీఎం, తెలంగాణ జనసమితి సహా పలు పార్టీల నేతలు తమ సూచనలు అందించారు. విపత్తు సమయంలో రాజకీయ విభేదాలకంటే ప్రజల అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. కేంద్రం నుంచి అవసరమైన సహాయం పొందేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ విభాగాల సమన్వయం, అఖిలపక్ష సహకారంతో ముందస్తు సన్నద్ధతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.



బీఆర్ఎస్‌కు ప్రజాస్వామ్యం గురించి

మాట్లాడే హక్కుందా?

- ధర్నా చౌక్ ఎత్తేసినవారే ఇప్పుడు నీతులు చెబుతున్నారు?
- మంత్రి పొంగులేటి విమర్శలు

ప్రజాస్వామ్యం, నిరసన హక్కుల గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు గతంలో తమ పాలనలో అనుసరించిన విధానాలను గుర్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హితవు పలికారు. ఇందిరాపార్క్‌లో ధర్నా చౌక్‌ను తొలగించి ప్రజల నిరసనలకు అవకాశం లేకుండా చేసినవారే ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నా చౌక్‌ను పునరుద్ధరించి, ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష నేతల భాష, వ్యవహారశైలి బాధాకరంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఓటు హక్కు కోసం కాంగ్రెస్ పోరాటం

నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాదయాత్రపై స్పందిస్తూ, కేంద్రంలో నిరసనలకు ఆటంకాలు కల్పిస్తూ తెలంగాణలో పాదయాత్రలు చేయడం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. ప్రతి రాజకీయ పార్టీకి నిరసనలు, పాదయాత్రలు నిర్వహించే స్వేచ్ఛ ఉండాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు తొలగిపోతున్నాయనే ఆందోళనతో కాంగ్రెస్ పోరాడుతోందని తెలిపారు. గత నాలుగైదు నెలలుగా ఢిల్లీలో వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టినా కేంద్రం, ఎన్నికల సంఘం స్పందించడం లేదని విమర్శించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన రాజీనామా చేయాలని లేదా చట్టప్రకారం పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి తిరిగి ఓటు హక్కు కల్పించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రైళ్ల కేటాయింపులో రాజకీయ వివక్ష తగదు

ఓటు హక్కుల పరిరక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్, ఇండియా కూటమి భారీ ర్యాలీ నిర్వహించనున్నాయని పొంగులేటి తెలిపారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నా రైల్వే బోగీల కేటాయింపునకు కేంద్రం అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు. గత పది రోజులుగా తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలకు రైళ్ల కేటాయింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైల్వేలు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ సొత్తు కాదు, అవి భారత ప్రజల ఆస్తి అని స్పష్టం చేశారు. రైల్వే శాఖతో పాటు ఇతర కేంద్ర సంస్థల నిర్ణయాలను ఆధారాలతో ప్రశ్నిస్తామని, ప్రజాస్వామ్య నిరసనలను అడ్డుకునే చర్యలపై ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు.

క్యాన్సర్ పేషంట్లకు గుడ్ న్యూస్

- భారీగా తగ్గనున్న మందుల ధరలు
- 543 బ్రాండ్లపై భారీ తగ్గుదల
- నవంబర్ 9 నుంచి కొత్త రేట్లు అమలు

క్యాన్సర్ రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. 543 బ్రాండ్ల క్యాన్సర్ మందుల గరిష్ఠ చిల్లర ధరలను (ఎంఆర్‌పీ) తగ్గిస్తూ జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) కొత్త ధరల జాబితాను విడుదల చేసింది. సవరించిన ధరలు 2026 నవంబర్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. మందుల తయారీ సంస్థలు అక్టోబర్ 27 వరకు అందించిన ధరల వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. క్యాన్సర్ చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న కుటుంబాలకు ఈ నిర్ణయం ఆర్థికంగా ఉపశమనం కలిగించనుంది. తయారీ సంస్థలు కొత్త ధరలను సమర్పించినకొద్దీ జాబితాను ఎన్‌పీపీఏ అప్‌డేట్ చేయనుంది.

కీలక మందుల ధరల్లో భారీ తగ్గింపు

కొన్ని క్యాన్సర్ మందుల ధరలు గణనీయంగా తగ్గాయి. ఆర్‌పీజీ లైఫ్ సైన్సెస్‌కు చెందిన అనార్జోల్ 1 ఎంజీ మాత్రల పది టాబ్లెట్ల ప్యాక్ ధర రూ.695.76 నుంచి రూ.73కు తగ్గింది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ అజాసిటిన్ ఇంజెక్షన్ ధర రూ.6,337 నుంచి రూ.1,495.04కు చేరింది. అబాట్ హెల్త్‌కేర్ బెవాసిజుమాబ్ 4 ఎంఎల్ ఇంజెక్షన్ ధర రూ.21,767.70 నుంచి రూ.5,930.13కు తగ్గింది. డెబ్రమాబ్ ఇంజెక్షన్ ధర రూ.22,031.25 నుంచి రూ.5,941కు చేరింది. ఎనుటా క్యాప్సూల్స్ ప్యాక్ ధర రూ.6,578.20 నుంచి రూ.2,232కు తగ్గింది. మందుల బ్రాండ్, మోతాదు, ప్యాకింగ్‌ను బట్టి ధరల తగ్గింపు మారుతుంది.

పంపిణీ లాభాలపై పరిమితితో ఊరట

క్యాన్సర్ మందుల ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం 137 రకాల నాన్ షెడ్యూల్డ్ మందులపై ట్రేడ్ మార్జిన్ రేషనలైజేషన్ విధానాన్ని అమలు చేస్తోంది. ఎంపిక చేసిన మందుల గరిష్ఠ చిల్లర ధరలో వ్యాపార మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేసింది. ఔషధాల పంపిణీ వ్యవస్థలో అధిక లాభాలను నియంత్రించడం ద్వారా రోగులపై భారం తగ్గించడమే లక్ష్యం. రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగించే డెనోసుమాబ్, కీమోథెరపీ సమయంలో తెల్ల రక్తకణాల తగ్గుదలను నివారించేందుకు ఉపయోగించే పెగ్‌ఫిల్గ్రాస్టిమ్, కొన్ని క్యాన్సర్ల చికిత్సలో వాడే బెవాసిజుమాబ్ వంటి మందులు ఈ చర్య పరిధిలో ఉన్నాయి. రోగులు తమకు సూచించిన నిర్దిష్ట బ్రాండ్ ధరను ఎన్‌పీపీఏ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి, నవంబర్ 9 నుంచి వర్తించే కొత్త ధరల ప్రకారం మందులు కొనుగోలు చేయాలి.



ఓటర్ల ఫారాలపై ఈసీకి షాక్!

- పాత ఓటర్లకు కొత్త దరఖాస్తులెందుకు?
- నిబంధనలు మార్చొద్దన్న సుప్రీం కోర్టు

ఢిల్లీలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై విచారణ సందర్భంగా భారత ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారి పేర్లు తిరిగి చేర్చేందుకు కొత్త ఓటర్ల నమోదు కోసం ఉద్దేశించిన ఫామ్ 6 ఎందుకు సమర్పించాలంటూ ప్రశ్నించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన ఉన్నారు. ఫామ్ 6, ఫామ్ 7, ఫామ్ 8 నిర్దేశిత నమూనాలని, వాటిని ఎన్నికల సంఘం మార్చడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అర్హులైన ఓటర్లు సాంకేతిక కారణాలతో ఓటు హక్కు కోల్పోకుండా సరళమైన పరిష్కారం చూపాలని సూచించింది.

అక్టోబర్ 30 గడువుపై అభ్యంతరం

ఢిల్లీలో సమీప భవిష్యత్తులో ఎన్నికలు లేనప్పుడు అక్టోబర్ 30తో దరఖాస్తుల గడువును ముగించాల్సిన అవసరం ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. పేర్ల పునరుద్ధరణకు కచ్చితమైన తుది గడువు విధించవద్దని సూచించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, చాలామంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదని, మరికొందరు వివిధ కారణాలతో వాటిని సమర్పించలేకపోయారని తెలిపారు. ఢిల్లీలోనే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారినవారిని కొత్త ఓటర్లుగా పరిగణించడం సరికాదన్నారు. చిరునామా మార్పునకు ఫారం 8 ఉండగా, పాత ఓటర్లతో ఫామ్ 6 నింపించడం సమంజసం కాదని వాదించారు.


47 లక్షల మంది ఫారాలు సమర్పించలేదు

పిటిషనర్లు అంజలి భరద్వాజ్, అమృత జోహ్రీ దాఖలు చేసిన వ్యాజ్యాల ప్రకారం, ఢిల్లీలో ఎస్ఐఆర్ ప్రారంభ సమయంలో సుమారు 1.45 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు 97 లక్షల మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించగా, సుమారు 47 లక్షల మంది ఫామ్‌లు అందలేదు. వీరిలో 31.59 లక్షల మందిని శాశ్వతంగా వలస వెళ్లినవారిగా, సుమారు 11 లక్షల మందిని కనిపించనివారు లేదా ఆచూకీ లేనివారిగా గుర్తించారని పిటిషనర్ల తరపు న్యాయవాది తెలిపారు. మరో రెండు లక్షల మంది మరణించినవారిగా నమోదయ్యారని పేర్కొన్నారు. ఫామ్‌లు అందకపోవడం లేదా సమర్పించలేకపోవడం వల్లే చాలామంది జాబితాకు దూరమై ఉండవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్లను నేరుగా సంప్రదించి, దరఖాస్తులను స్వీకరించే సరళమైన విధానాన్ని అనుసరించాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. గడువు పొడిగించేందుకు ఈసీ సుముఖత తెలిపింది.



2029లోనూ కాషాయ రెపరెపలు

- మళ్లీ ఎర్రకోటపై మోదీ జెండా ఎగురవేస్తారు
- రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పతనం ఖాయం
- 2029 ఎన్నికల్లోనూ బీజేపీదే విజయమన్న నితిన్ నబీ



2029 లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఎర్రకోటపై నుంచి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేస్తారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలోని చాందినీ చౌక్ ప్రాంతంలో నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకతా హటావో' ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా, పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జైన్ లాల్ ఆలయం నుంచి టౌన్‌హాల్ చౌక్ వరకు సాగిన ర్యాలీలో నబీన్ మాట్లాడుతూ, 2029లోనూ బీజేపీ అధికారాన్ని నిల బెట్టుకుంటుందని ప్రకటించారు.

ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్‌కు విమర్శలు

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ వ్యతిరేకించడంపై నితిన్ నబీన్ మండిపడ్డారు. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసే చర్యలతో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారని, ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదారుల పేర్లను తొలగించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని అన్నారు. రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి దాని పట్ల గౌరవం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ లేదా ఆయన కుటుంబం చెప్పినట్లే నడుస్తోందని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనను వ్యతిరేకించడం వెనుక కాంగ్రెస్ ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

రాహుల్ నాయకత్వంపై నబీన్ ఘాటు వ్యాఖ్యలు

రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చివరి దశకు చేరుకుందని నితిన్ నబీన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే పార్టీలో చివరకు రాహుల్ గాంధీ మాత్రమే మిగిలే పరిస్థితి వస్తుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బలహీనపడుతున్నా నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ మరింత బలపడుతోందని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో మోదీ మళ్లీ ప్రధానిగా బాధ్యతలు చేపడతారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు.

బ్యాలెట్ పేపర్లలోనూ సున్నా!

- 4 రాష్ట్రాల్లో ఘోర పరాజయం
- కాంగ్రెస్‌పై మోదీ వ్యంగ్యాస్త్రాలు



నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించారని ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ మోనోకిల్ ఎమోజీతో సెటైర్ వేశారు. మొత్తం 28 స్థానాల్లో కాంగ్రెస్ 12 చోట్ల పోటీ చేయగా, గతంలో గెలిచిన నాలుగు స్థానాలను కూడా నిలబెట్టుకోలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ ఒక్క స్థానం గెలవకపోవడం కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

ఈవీఎంలపై కాంగ్రెస్ వాదనకు బీజేపీ కౌంటర్

ఎన్నికల్లో ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బ్యాలెట్ పేపర్లకు తిరిగి వెళ్లాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. బీజేపీ నేత స్మృతి ఇరానీ కూడా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఈవీఎంలను తప్పుబడుతూ ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్న పార్టీకి బ్యాలెట్ పేపర్లపై జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు గట్టి సమాధానం ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఓటమికి సాకులు వెతకకుండా క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పేపర్లపై జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఖాతా తెరవకపోవడాన్ని బీజేపీ తన వాదనకు బలంగా చూపిస్తోంది.



సీఈసీపై విపక్షాల బహిరంగ అభిశంసన!

- ఖర్గే నివాసంలో రేపు కార్యక్రమం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై 'బహిరంగ అభిశంసన' కార్యక్రమాన్ని అక్టోబర్ 30న నిర్వహించాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసం, 10 రాజాజీ మార్గ్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ విషయాన్ని ప్రకటించారు. తొలుత అశోక్ హోటల్, రామ్‌లీలా మైదాన్‌లో కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నించినప్పటికీ అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయని కాంగ్రెస్ ఆరోపించింది. దీంతో ఖర్గే నివాసాన్ని వేదికగా ఎంపిక చేశారు. ఎన్నికల సంఘం పనితీరుపై తమ నిరసనను బహిరంగంగా వ్యక్తం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని విపక్షాలు చెబుతున్నాయి.

రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఆరోపణ

జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగ స్ఫూర్తికి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను బలహీనపరిచారని, సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని విమర్శించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో పాటు ఎన్నికల సంఘం పారదర్శకతపై విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సైతం కార్యక్రమానికి అనుమతుల విషయంలో అధికారులు అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడితోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయని ఆయన విమర్శించారు.

నవంబర్ 1 ర్యాలీకి సన్నాహాలు

ఎన్నికల జాబితాల్లో అక్రమాలు, ఎస్ఐఆర్ ప్రక్రియపై నిరసనగా నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా కూటమి భారీ ర్యాలీ నిర్వహించనుంది. అక్టోబర్ 30న జరిగే కార్యక్రమాన్ని ఈ ర్యాలీకి ముందస్తు కార్యాచరణగా విపక్షాలు భావిస్తున్నాయి. అయితే రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న ర్యాలీ నిర్వహించేందుకు మాత్రమే కాంగ్రెస్ అనుమతి కోరిందని, షరతులతో అనుమతి ఇచ్చామని ఢిల్లీ పోలీసు అధికారులు తెలిపారు. బహిరంగ అభిశంసన కార్యక్రమానికి ప్రత్యేక అనుమతి అభ్యర్థన అందలేదని వెల్లడించారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత, ఓటర్ల జాబితాల పారదర్శకత అంశాలపై విపక్షాల పోరాటం మరింత ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఒక పాట పుడుతుంది.. కోట్లాది హృదయాలను గెలుస్తుంది! తరతరాలుగా ప్రజల నాలుకలపై నడిచే జానపదం వెండితెరపై మెరిస్తుంది. కానీ ఆ పాట వెనుక అసలు సృజనకర్త ఎవరు? దాని ద్వారా వచ్చే ఆదాయం ఎవరికి చెందాలి? గుర్తింపు పొందాల్సిన కళాకారుడికి అన్యాయం జరిగితే అడిగేదెవరు? ఇప్పుడు ఈ ప్రశ్నలే సంగీత ప్రపంచాన్ని కుదిపేస్తున్నాయి. గరివిడి లక్ష్మి ఆవేదన ఒకవైపు.. ఆమె ఆరోపణలను ఖండిస్తున్న సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ వాదన మరోవైపు! ఇంతలోనే దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజా, సరిగమా మధ్య కాపీరైట్ పోరు కోర్టుల గడప తొక్కింది. సంగీత రచన ఒకరిది.. అసలు రికార్డింగ్ హక్కులు మరొకరివా? జానపద బాణీ ప్రజల సంపదా? దానికి కొత్త రూపమిచ్చిన కళాకారుడి హక్కుల సంగతేంటి? డిజిటల్ యుగంలో పాత పాటలే కోట్ల రూపాయల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న వేళ ఈ ప్రశ్నలకు ప్రాధాన్యం మరింత పెరిగింది. ఆరోపణలు నిజాలవుతాయా? ఒప్పందాలు ఎవరికి అండగా నిలుస్తాయి? బయోపిక్‌లో కనిపించినదంతా వాస్తవమేనా? పాట వెనుక దాగిన హక్కుల లెక్కలు.. కళాకారుల ఆవేదన.. కోర్టుల కీలక పరిశీలనలు! అసలు వివాదం ఏమిటి? న్యాయం ఎవరి పక్షాన నిలుస్తుంది?



మ్యూజిక్ హక్కుల గోలేంటి..?



- ఇళయరాజా అభ్యంతరాలు ఎందుకు?
- గరివిడి లక్ష్మి ఆరోపణల్లో నిజమెంత?
- పాట ఎవరిది.. హక్కులు ఎవరికి?
- జానపదం నుంచి కోర్టు వరకు పోరాటం!

పాట ఆరోపణల బాట పట్టింది. సంగీతం కోర్టు మెట్లు ఎక్కుతోంది. సాహిత్యం తన హక్కుల కోసం గళమెత్తుతోంది. పాట ఎవరి సొంతం? దాని ద్వారా వచ్చే ఆదాయం ఎవరికి చెందాలి? సృజన చేసిన కళాకారుడికి తగిన గుర్తింపు దక్కుతోందా? అనే ప్రశ్నలు సంగీత ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి. పాటల హక్కులపై వివాదాలు కొత్తవి కావు. తెలంగాణ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తరతరాలుగా ప్రజల్లో వినిపిస్తున్న జానపదాలను సినిమాల్లో ఉపయోగించినప్పుడు వాటి మూలం, హక్కులపై వివాదాలు తలెత్తుతుంటాయి. 'మహాత్మ' సినిమాలోని 'నీలపురి గాజుల ఓ నీలవేణి' నుంచి 'ది పారడైజ్' చిత్రంలోని 'ఎషనాగుల కట్ట మీద' వరకు ఇలాంటి చర్చలు వినిపించాయి. గరివిడి లక్ష్మి బయోపిక్‌తో పాత పాటల హక్కుల వివాదం మళ్లీ తెరపైకి రాగా, ఇళయరాజా-సరిగమా వివాదంపై సుప్రీంకోర్టు పరిశీలనలు మరోసారి కాపీరైట్ అంశాన్ని ముందుకు తెచ్చాయి. ఈ రెండు వివాదాలు పైకి వేర్వేరుగా కనిపించినా, కళాకారుడి కృషి, హక్కులు, గుర్తింపు అనే అంశాలు రెండింటిలోనూ కీలకంగా ఉన్నాయి. అయితే ఇళయరాజా కేసులో సంగీత రచన, అసలు సౌండ్ రికార్డింగ్ హక్కులు ప్రధానమైతే, గరివిడి లక్ష్మి వివాదంలో జానపద బాణీల మూలం, ఇచ్చిన హామీలు, పారితోషికం, గుర్తింపు వంటి అంశాలు ప్రధానంగా నిలుస్తున్నాయి.

గరివిడి లక్ష్మి ఆరోపణలు.. ఆర్పీ పట్నాయక్ ఖండన

గరివిడి లక్ష్మి తనకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, పాటలు పాడే అవకాశాలు కల్పిస్తామని చెప్పినప్పటికీ ఆ మాట నిలవలేదని ఆరోపిస్తున్నారు. తనకు తగిన పారితోషికం చెల్లించలేదని, పాటల్లో తన కృషికి సరైన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలన్నింటినీ నేరుగా కాపీరైట్ ఉల్లంఘనగా పరిగణించలేం. వాటి వెనుక ఉన్న వాస్తవాలు, ఒప్పందాలు పరిశీలించాలి. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ఈ ఆరోపణలను ఖండించారు. 'చిత్రం' సినిమా విజయోత్సవ పర్యటనలో దర్శకుడు తేజ, రచయిత కులశేఖర్‌తో కలిసి విజయనగరం వెళ్లినప్పుడే గరివిడి లక్ష్మిని తొలిసారి కలిశానని తెలిపారు. ఉత్తరాంధ్ర జానపద బాణీలు తరతరాలుగా ప్రజల్లో ఉన్నాయని, వాటిపై ఒక వ్యక్తికి మాత్రమే సంపూర్ణ హక్కులు ఉండవని అభిప్రాయపడ్డారు. తాను ఉపయోగించిన బాణీలు కళాశాల రోజుల నుంచే తనకు తెలుసని, వాటికి కొత్త సాహిత్యం, ఆధునిక సంగీతాన్ని జోడించామని వివరించారు. బయోపిక్‌లో తన పాత్రను తప్పుగా చూపించారన్న అభ్యంతరాన్ని కూడా వ్యక్తం చేశారు. ప్రజాగాయకుడు వంగపండు ప్రసాదరావు 'ఏం పిల్లాడో ఎల్దమొస్తావా..!' పాట విషయంలోనూ హక్కుల కోసం పోరాడారు. ఈ ఉదాహరణలు జానపదాల మూలం, కొత్త సృజన మధ్య ఉన్న సంక్లిష్టతను తెలియజేస్తున్నాయి. తరతరాలుగా ప్రజల్లో ఉన్న బాణీని ఉపయోగించడం ఒక అంశమైతే, దానికి కొత్త సాహిత్యం లేదా ప్రత్యేక సంగీత రూపకల్పన జోడించడం మరో అంశం. అందువల్ల గరివిడి లక్ష్మి ఆరోపణలు నిజమా కాదా అన్నది ఆధారాలతోనే తేలాలి. బయోపిక్‌లో చూపించిన ప్రతి సంఘటనను నిర్ధారిత వాస్తవంగా భావించలేం. అదే సమయంలో ఆమె ఆవేదనను కూడా ఆధారాలు పరిశీలించకుండా తోసిపుచ్చడం సరికాదు.

ఇళయరాజా–సరిగమా వివాదం.. కాపీరైట్ చట్టం ఏం చెబుతోంది?

ఇళయరాజా, సరిగమా ఇండియా మధ్య వివాదంలో ఢిల్లీ హైకోర్టు 2026 మే 21న కీలక పరిశీలనలు చేసింది. సంగీత రచన హక్కులు, అసలు సౌండ్ రికార్డింగ్ హక్కులు వేర్వేరని పేర్కొంది. 2026 అక్టోబర్ 1న సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. అయితే హైకోర్టు పరిశీలనలు ప్రాథమికమైనవేనని స్పష్టం చేసినందున, ఈ పరిణామాన్ని ఇళయరాజా స్వరపరిచిన అన్ని పాటలపై తుది తీర్పుగా చూడకూడదు. 'మూడుపణి' (1980) చిత్రంలోని 'ఎన్ ఇనియా పొన్ నిలవే' పాటను మరో చిత్రంలో కొత్తగా రికార్డు చేసి ఉపయోగించే అంశం వివాదానికి కారణమైంది. అసలు చిత్ర నిర్మాతతో ఒప్పందాల ద్వారా సౌండ్ రికార్డింగ్ హక్కులు పొందామని సరిగమా వాదించగా, సంగీత రచనపై తనకు హక్కులు ఉన్నాయని ఇళయరాజా పేర్కొన్నారు. సరిగమా దాఖలు చేసిన కేసులో 134 సినిమాలకు సంబంధించిన సంగీతాన్ని ఇళయరాజా స్వయంగా వినియోగించుకోవడం లేదా ఇతరులకు లైసెన్స్ ఇవ్వడంపై మధ్యంతర నిషేధం విధించిన అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. భారత కాపీరైట్ చట్టం, 1957 ప్రకారం సంగీత రచనలు, సాహిత్యం, సినిమాలు, సౌండ్ రికార్డింగ్‌లకు రక్షణ ఉంటుంది. సెక్షన్ 14 ప్రత్యేక హక్కుల పరిధిని వివరిస్తే, సెక్షన్ 18 ప్రకారం హక్కులను ఒప్పందం ద్వారా పూర్తిగా లేదా కొంత వరకు బదిలీ చేయవచ్చు. డిజిటల్ వేదికల ద్వారా పాత పాటలు కూడా ఆదాయం తెస్తున్న నేపథ్యంలో ఈ హక్కులకు ఆర్థిక ప్రాధాన్యం పెరిగింది. ఒక పాటకు సంగీతం అందించిన వ్యక్తికి అన్ని హక్కులూ ఉండకపోవచ్చు. అలాగే జానపద సంప్రదాయంలో కొత్త సృజన చేసిన కళాకారుడి కృషిని విస్మరించలేం. సంప్రదాయానికి గౌరవం, సృజనకు గుర్తింపు, ఒప్పందాల్లో పారదర్శకత ఉంటేనే కళాకారులకు న్యాయం జరుగుతుంది. పాట పల్లవించాలంటే హక్కులపై స్పష్టతతో పాటు కళాకారుడి కృషికి తగిన విలువ ఇవ్వడం కూడా అవసరం.

జవహర్‌నగర్ డంప్‌యార్డు తరలింపునకు బీజేపీ పోరుబాట

నాలుగు రోజుల ఆందోళనలో రెండో రోజు పాల్గొన్న డివిజన్ నాయకులు



కుత్బుల్లాపూర్, అక్టోబరు 28: జవహర్‌నగర్ డంప్‌యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 279 రోడా మిస్త్రీ నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నాలుగు రోజుల పోరుబాట కొనసాగుతోంది. ఈ ఆందోళనలో భాగంగా రెండో రోజు డివిజన్ అధ్యక్షుడు నేమూరి నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నారాయణపేట జిల్లా ఇన్‌చార్జి భాను చందర్ వర్మ, లేబర్ సెల్ కో-కన్వీనర్ రాము, డివిజన్ ప్రధాన కార్యదర్శి పులి రాజు, ఉపాధ్యక్షులు నాగరాజు చారి, సల్లూరి వీరాచారి, కార్యదర్శులు రామకృష్ణ, సిద్ధం సంతోష్, పత్తి కృష్ణ, రాజేష్, విజయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కడపలో వైసీపీ సరికొత్త రాజకీయం

- బలిజ నేతలతో అవినాష్ భేటీకి రంగం సిద్ధం?
- సమతం రాము నివాసంలో రహస్య సమావేశం
- బండి దీప్తి కోసం నేతల ఐక్య కార్యాచరణ!



కడప మేయర్ ఎన్నిక చుట్టూ రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి బండి దీప్తికి మద్దతుగా వివిధ పార్టీలకు చెందిన బలిజ నేతలు ఒక్కతాటిపైకి వస్తున్నారన్న ప్రచారం స్థానిక రాజకీయాల్లో చర్చకు దారితీసింది. రాష్ట్ర కాపు బలిజ సంఘం నేత సమతం రాము నివాసంలో నాయకులు సమావేశమైనట్లు సమాచారం. తదుపరి కార్యాచరణపై చర్చించిన నేతలు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసేందుకు ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

టికెట్ల అసంతృప్తి.. ఐక్యతకు ప్రయత్నాలు

కార్పొరేటర్ టికెట్ల కేటాయింపులో బలిజ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం దక్కలేదన్న అసంతృప్తి కొందరు నాయకుల్లో ఉందని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో అదే సామాజికవర్గానికి చెందిన బండి దీప్తి మేయర్ అభ్యర్థిగా ఉండటాన్ని రాజకీయ అవకాశంగా భావిస్తున్నట్లు సమాచారం. గతంలో వంగవీటి నరేంద్రతో పాటు పలువురు బలిజ నేతలు వేర్వేరుగా సమావేశమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రయత్నాలకు సమతం రాము నేతృత్వంలో సమన్వయం కల్పించే దిశగా చర్చలు సాగుతున్నాయన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. సామాజికవర్గ ఐక్యతను రాజకీయ బలంగా మార్చుకోవాలన్న ప్రయత్నమే ఈ పరిణామాల వెనుక ప్రధాన అంశంగా కనిపిస్తోంది.

ఆరోపణలు, ప్రతివిమర్శలతో వేడెక్కిన పోరు

మరోవైపు కడప టీడీపీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి మధ్య ఆరోపణలు, ప్రతివిమర్శలతో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. ఎమ్మెల్యే స్వయంగా ప్రచారంలో పాల్గొనడం, వరుస మీడియా సమావేశాలు నిర్వహించడంపై కొన్ని వర్గాల్లో అసంతృప్తి ఉందన్న చర్చ వినిపిస్తోంది. ఏకగ్రీవాల ప్రక్రియ, కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపికపైనా భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ పరిణామాలు ఓటింగ్‌పై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. రాజకీయ పార్టీల అధికారిక ప్రకటనలు, ఎన్నికల ప్రక్రియలో తదుపరి పరిణామాలు కీలకం కానున్నాయి.

బలిజలు, మైనార్టీల మద్దతుపై ఉత్కంఠ

టీడీపీలోని బలిజ నేతల్లో 60 శాతం మంది, ఎమ్మెల్యేపై అసంతృప్తితో ఉన్న మైనార్టీల్లో 90 శాతం మంది బండి దీప్తికి అనుకూలంగా ఉన్నారన్న అంచనాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బలిజ నేతలు ఐక్యంగా ముందుకు వస్తారా? ఎంపీ అవినాష్‌రెడ్డితో భేటీ జరిగితే ఎలాంటి రాజకీయ సంకేతాలు వెలువడతాయి? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. బండి దీప్తి అభ్యర్థిత్వం చుట్టూ ఏర్పడుతున్న ఈ సమీకరణాలు మేయర్ ఎన్నికలో ఎంతటి ప్రభావం చూపుతాయో తదుపరి సమావేశాలు, నాయకుల అధికారిక ప్రకటనలతోనే స్పష్టమవుతుంది.



వేంపల్లి మామకు వైస్ ఎంపీపీ ఇవ్వాలి!

- రెండు దశాబ్దాల సేవకు గుర్తింపు దక్కేనా?
- పార్టీ కష్టకాలంలోనూ వెన్నుదన్ను
- టీఎన్ఎస్ఎఫ్ నాయకుడిగా ప్రస్థానం..

వేంపల్లి మండల తెలుగుదేశం పార్టీలో దాదాపు రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న మహమ్మద్ అలియాస్ 'వేంపల్లి మామ'కు వైస్ ఎంపీపీ పదవి కేటాయించాలనే డిమాండ్ స్థానికంగా ప్రాధాన్యం సంతరించుకుంది. విద్యార్థి దశ నుంచి పార్టీ కోసం పనిచేస్తూ, కష్టకాలంలోనూ జెండాను విడిచిపెట్టకుండా కార్యకర్తలకు అండగా నిలిచిన ఆయన సేవలను గుర్తించాలని అభిమానులు కోరుతున్నారు. పదవులు ఉన్నా లేకున్నా పార్టీ కార్యక్రమాల్లో ముందుండే నాయకుడిగా మహమ్మద్‌కు గుర్తింపు ఉందని వారు పేర్కొంటున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి అధికారంలోనూ తగిన బాధ్యతలు అప్పగిస్తే ఇతర కార్యకర్తలకు ప్రోత్సాహం లభిస్తుందని స్థానిక రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

టీఎన్ఎస్ఎఫ్ నుంచి క్లస్టర్ ఇన్‌చార్జి వరకు

మహమ్మద్ రాజకీయ ప్రస్థానం 2016-17లో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రారంభమైంది. అనంతరం తెలుగు యువత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శిగా, క్లస్టర్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రొద్దుటూరు, కడప, పులివెందుల, కమలాపురం ప్రాంతాల్లో జరిగే పార్టీ సమావేశాలకు కార్యకర్తలను సమీకరించడంలో కీలకంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ పలువురిని టీడీపీలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారని అనుచరులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రెండుసార్లు ఏజెంట్‌గా పనిచేయడంతో పాటు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎనిమిది బూత్‌లకు ఏజెంట్లను ఏర్పాటు చేయడంలో చొరవ చూపారని గుర్తుచేస్తున్నారు. కార్యకర్తలతో నిరంతర సంబంధాలు, స్థానికులతో సత్సంబంధాలు ఆయనకు 'వేంపల్లి మామ' అనే ఆప్యాయమైన గుర్తింపును తెచ్చాయని చెబుతున్నారు.

ఎంపీటీసీ ఫలితాలతో పెరిగిన పదవిపై ఆశలు

వేంపల్లి మండలంలోని 18 ఎంపీటీసీ స్థానాల్లో 17 స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అందుబాటులో ఉన్న వివరాలు సూచిస్తున్నాయి. ఇందులో టీడీపీకి 15, బీజేపీకి ఒకటి, జనసేనకు ఒక స్థానం దక్కగా, అలిరెడ్డిపల్లె స్థానంలో పోటీ అనివార్యమైంది. ఈ నేపథ్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ ముందుకొస్తోంది. మహమ్మద్‌కు వైస్ ఎంపీపీ బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి మరింత ప్రయోజనం కలుగుతుందని ఆయన అభిమానులు భావిస్తున్నారు. అయితే, పదవిపై తుది నిర్ణయం పార్టీ నాయకత్వానిదే. రెండు దశాబ్దాల రాజకీయ సేవకు గుర్తింపుగా వైస్ ఎంపీపీ అవకాశం లభిస్తుందా? అన్నది ఇప్పుడు వేంపల్లి టీడీపీలో ఆసక్తికర చర్చగా మారింది.



వేంపల్లెలో వైసీపీ ప్రచారం ముమ్మరం

వేంపల్లె మండలంలో జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైసీపీ అభ్యర్థి బత్తుల వెంకట శివమ్మకు మద్దతుగా పార్టీ నాయకులు అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆమెను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మాజీ జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ షబ్బీర్ వల్లి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ, వైఎస్ జగన్ పాలనలో వేంపల్లె మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ వైసీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. వెంకట శివమ్మ విజయాన్ని జగన్‌కు కానుకగా అందించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో వైసీపీ మండల ఉపాధ్యక్షుడు మునీర్, సింగారెడ్డి రోహన్ నాగిరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పులివెందులలో టీడీపీకి కొత్త బలం

పులివెందుల మున్సిపాలిటీలోని నగరిగుట్టకు చెందిన 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. కావేటి కొండప్ప, శ్రీనివాసులు, ఎస్. పెంచలయ్య ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. రాష్ట్ర హజ్ అండ్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా, తూగుట్ల మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లోకూటమి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పులివెందుల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. నగరిగుట్టకు చెందిన కుటుంబాల చేరికతో స్థానికంగా పార్టీ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని నాయకులు పేర్కొన్నారు.



పారిశుధ్య కార్మికుడు మునయ్య మృతికి నివాళులు

ప్రొద్దుటూరు పురపాలక సంఘంలోని మూడో డివిజన్‌లో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కులూరు మునయ్య మృతిపై ప్రతిపాదిత మున్సిపల్ చైర్మన్ సంద్యాల రాఘవరెడ్డి, కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సంతాపం వ్యక్తం చేశారు. మునయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్యం పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. నిరంతరం శ్రమిస్తూ సమాజానికి సేవలందించే కార్మికుల కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. మునయ్య కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, సూపర్‌వైజర్ నూర్ భాషా, కార్మిక నాయకులు సాల్మన్, చంటి, రాఘవ పాల్గొన్నారు.

యూపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి గట్టి పోటీ

పది స్థానాల్లో బీజేపీకి ఆరు.. ఎస్పీకి నాలుగు

ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార బీజేపీకి సమాజ్‌వాదీ పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు సుమారు ఐదు నెలల ముందు జరిగిన ఈ పోరులో రెండు పార్టీల మధ్య దాదాపు సమాన స్థాయిలో ఫలితాలు నమోదయ్యాయి. బుధవారం రాత్రి 11.30 గంటల నాటికి పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు చెందిన 11 స్థానాల్లో పదింటి ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో బీజేపీ ఆరు స్థానాలు గెలుచుకోగా, అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ నాలుగు స్థానాలను కైవసం చేసుకుంది. వారణాసి పట్టభద్రుల నియోజకవర్గంలో ఎస్పీ అభ్యర్థి ఆధిక్యంలో ఉన్నారు.

బీజేపీ నుంచి కీలక స్థానాలు చేజారాయి

లక్నో పట్టభద్రుల స్థానంలో ఎస్పీ అభ్యర్థి కాంతి సింగ్ పటేల్, సిట్టింగ్ బీజేపీ అభ్యర్థి అవనీశ్ కుమార్ సింగ్‌పై విజయం సాధించారు. అగ్రా ఉపాధ్యాయుల స్థానంలోనూ ఎస్పీ అభ్యర్థి ఆకాష్ అగర్వాల్ గెలిచారు. అలహాబాద్-ఝాన్సీ పట్టభద్రుల స్థానాన్ని మన్ సింగ్ యాదవ్ ఎస్పీ ఖాతాలో వేశారు. వారణాసి ఉపాధ్యాయుల స్థానంలో ఎస్పీ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ 11,612 ఓట్లతో విజయం సాధించారు. మరోవైపు, మీరట్ పట్టభద్రుల స్థానంలో దినేశ్ కుమార్ గోయల్, ఆగ్రాలో మన్వేంద్ర ప్రతాప్ సింగ్ సహా ఉపాధ్యాయుల నియోజకవర్గాల్లో ఉమేశ్ ద్వివేది, శ్రీచంద్ శర్మ, హరి సింగ్ ధిల్లాన్, ధ్రువ్ కుమార్ త్రిపాఠి బీజేపీ తరపున గెలిచారు.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ సంకేతాలు

ఎన్నికల ఫలితాలపై స్పందించిన మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్.. ఎమ్మెల్సీ ఎన్నికలు బీజేపీ రాజకీయాలకు ముగింపు పలికాయని వ్యాఖ్యానించారు. గోరఖ్‌పూర్, వారణాసి ప్రాంతాల్లో అక్రమాలు, అధికార యంత్రాంగం దుర్వినియోగం జరిగాయని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. 2020లో జరిగిన గత ఎన్నికల్లో బీజేపీ ఆరు, ఎస్పీ మూడు స్థానాలు గెలుచుకోగా, మరో రెండు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. తాజా ఫలితాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రరాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.





నిన్నగాక మొన్నొచ్చి టీడీపీలో ఆధిపత్యం!

- సీనియర్లకు షాక్
- కాపు నేతల్లో కలవరం
- టికెట్ రేసులో చిన్న శ్రీను దూకుడు

విజయనగరం జిల్లా టీడీపీ రాజకీయాల్లో చిన్న శ్రీను వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. జెడ్పీ చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు కేటాయించడంతో కళా వెంకట్రావు, కంది చంద్రశేఖర్, కర్రోతు బంగార్రాజు కుటుంబాల నుంచి అభ్యర్థులు సిద్ధమయ్యారు. నామినేషన్లు వేసినా తమవారికే టికెట్ వస్తుందనే నమ్మకం వారిలో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు చిన్న శ్రీను తన కుమార్తె సిరి సహస్రను పోటీలో ముందుకు తీసుకురావడంతో సీనియర్ల రాజకీయ అనుభవం, పార్టీకి చేసిన సేవలు ప్రశ్నార్థకంగా మారాయి. ఇన్నాళ్లూ పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతలు ఇప్పుడు తమ అభ్యర్థుల కోసం గట్టిగా నిలబడలేకపోతున్నారా అన్న చర్చ మొదలైంది.

బీసీ కోటా.. కుల ధ్రువీకరణపై వివాదం!

సిరి సహస్ర నామినేషన్ చుట్టూ కుల ధ్రువీకరణ పత్రానికి సంబంధించిన వివాదం నెలకొంది. ఆమె నామినేషన్ వేసిన రెండు స్థానాలు ఓసీలకు కేటాయించినవే, ఐనా... ఆమె బీసీ సర్టిఫికెట్‌తో నామినేషన్ దాఖలు చేయడం రాజకీయంగా విమర్శలకు దారితీసింది. అధికార దుర్వినియోగంతో నామినేషన్‌ను ఆమోదింపజేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీలో అర్హులైన బీసీ మహిళలు లేరనే పరిస్థితి కూడా లేదని, కళా వెంకట్రావు, కంది చంద్రశేఖర్, కర్రోతు బంగార్రాజు కుటుంబాల్లో అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు.

నేతల మౌనం.. ఐక్యతకు పరీక్ష!

ఈ వ్యవహారంలో బొబ్బిలి ఎమ్మెల్యే వైఖరిపైనా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కొప్పల వెలమ మహిళలకు కూడా అవకాశం కల్పించాలని పార్టీ నాయకత్వాన్ని కోరలేదా అన్న చర్చ సాగుతోంది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సైతం సిరి సహస్ర నామినేషన్ సక్రమంగానే ఉందని స్పష్టం చేసినట్లు కథనం ప్రస్తావిస్తోంది. కళా, కంది, కర్రోతు నేతలు తమ అభ్యర్థుల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని ఉమ్మడిగా పట్టుబట్టలేకపోవడం చిన్న శ్రీను ఆధిపత్యానికి మార్గం సుగమం చేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చివరకు వైస్ చైర్‌పర్సన్ పదవితో సరిపెట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నారా అన్న ప్రశ్నలు కూడా తెరపైకి వస్తున్నాయి.

చంద్రబాబు వ్యూహం.. కాపు నేతలకు హెచ్చరిక!

చిన్న శ్రీనును పార్టీలోకి తీసుకున్నప్పుడు చంద్రబాబు విజయనగరం జిల్లాలో ముగ్గురు కాపు నేతలకు పెద్ద అవకాశాలు ఇచ్చినా, వారు తన అంచనాలకు తగ్గట్టుగా పార్టీని ముందుకు తీసుకెళ్లలేకపోయారన్న భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎంపీ కలిశెట్టి, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లపై అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో చిన్న శ్రీనుకు ప్రాధాన్యం పెరగడం కేవలం కుటుంబ రాజకీయాల అంశమే కాకుండా, పార్టీలోసీనియర్ల స్థానం, సామాజిక సమీకరణాలు, నాయకత్వంపై వారి ప్రభావానికి పరీక్షగా మారింది. అధినేత నిర్ణయాన్ని ప్రశ్నించలేని పరిస్థితా, లేక తమ రాజకీయ భవిష్యత్తు కోసం మౌనం వహిస్తున్నారా అన్నదే ఇప్పుడు టీడీపీలో ప్రధాన చర్చ.



చీరాల పురపోరు
నేతల మధ్య రాజకీయ సమరం!

చీరాల మున్సిపల్ ఎన్నికలు రోజురోజుకూ ఉత్కంఠ పెంచుతున్నాయి. నామినేషన్ల సమయంలో పార్టీలకు అతీతంగా ఆత్మీయంగా పలకరించుకున్న నాయకులు ఇప్పుడు ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఆరోపణలు, ప్రతివిమర్శలతో పట్టణంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ మధ్య నెలకొన్న త్రిముఖ పోరు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడంతో పాటు కౌన్సిల్‌లో ఆధిపత్యం సాధించేందుకు మూడు పార్టీల నేతలు వ్యూహాలకు పదును పెడుతున్నారు. నిన్నటి స్నేహపూర్వక పలకరింపులు నేటి రాజకీయ సవాళ్లుగా మారడం ఈ ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

మాలకొండయ్య, కరణం, ఆమంచికి ప్రతిష్మాత్మకం!

టీడీపీ తరపున ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, వైఎస్సార్‌సీపీ తరపున నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్, కాంగ్రెస్ తరపున మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఈ పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ ఒక్క వార్డుకే పరిమితమవగా, ఈసారి మెజారిటీ స్థానాలు సాధించాలని మాలకొండయ్య పట్టుదలతో ఉన్నారు. గతంలో 20 కౌన్సిలర్ స్థానాలు గెలుచుకున్న వైఎస్సార్‌సీపీ తన పట్టును నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. గత ఎన్నికల్లో తన మద్దతుతో 12 మంది స్వతంత్ర అభ్యర్థులను గెలిపించుకున్న ఆమంచి, ఈసారి కాంగ్రెస్ గుర్తుపై సత్తా చాటాలని భావిస్తున్నారు. ముగ్గురు నేతల రాజకీయ బలాబలాలకు ఈ ఎన్నికలు పరీక్షగా మారాయి.

ఇంటింటి ప్రచారం.. ప్రజా సమస్యలపై దృష్టి!

ప్రధాన నాయకులు విమర్శలతో ప్రచారాన్ని హోరెత్తిస్తుండగా, చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థులు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలను నేరుగా కలుసుకుని మద్దతు కోరుతున్నారు. హామీలతో పాటు స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెడుతున్నారు. ప్రచారంలో ఓ చైర్మన్ అభ్యర్థి వీధిలో పేరుకుపోయిన చెత్తను గుర్తించి, పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింపునకు చర్యలు చేపట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామనే సందేశాన్ని ఓటర్లలోకి తీసుకెళ్లేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో అభివృద్ధి, పారిశుద్ధ్యం, స్థానిక అవసరాలు ప్రచారంలో కీలక అంశాలుగా మారుతున్నాయి.

ఎస్సీ మహిళకు రిజర్వేషన్.. ఓటరు తీర్పుపై ఉత్కంఠ!

చీరాల మున్సిపల్ చైర్మన్ పీఠం ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో పార్టీల వ్యూహాలు మారాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార నిర్వహణ వరకు నాయకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంప్రదాయ ఓటు బ్యాంకులతో పాటు తటస్థ ఓటర్ల మద్దతు ఎవరికి లభిస్తుందన్నది కీలకంగా మారింది. స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, నాయకుల వ్యక్తిగత పలుకుబడి, వార్డుల వారీగా అభ్యర్థుల బలం ఫలితాలను ప్రభావితం చేయనున్నాయి. చైర్మన్ పీఠంపై ఏ పార్టీ జెండా ఎగురుతుంది? ముగ్గురు నాయకుల్లో ఎవరి వ్యూహం ఫలిస్తుంది? అన్నప్రశ్నలకు ఓటరు తీర్పే సమాధానం చెప్పనుంది. అప్పటివరకు చీరాల పురపోరులో రాజకీయ ఉత్కంఠ కొనసాగనుంది.

రబ్బర్ బుల్లెట్ బాధితుడికి జగన్ భరోసా



పులివెందులలో పోలీసుల కాల్పుల్లో రబ్బర్ బుల్లెట్ తగిలి గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గండికోట పవన్ కుమార్‌ను పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. గండికోట నాగభూషణం కుమారుడైన పవన్ కుమార్ ఈ నెల 17న నామినేషన్ సందర్భంగా జరిగిన ఘటనలో కాలికి రబ్బర్ బుల్లెట్ తగిలి తీవ్రంగా గాయపడ్డారు. పులివెందుల పర్యటనలో ఉన్న జగన్‌ను పవన్ కుమార్ కలిసి ఘటన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా జగన్ అతడి ఆరోగ్య పరిస్థితిని, గాయం తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గాయపడిన కార్యకర్తను మాజీ ముఖ్యమంత్రి స్వయంగా పరామర్శించడంతో పార్టీ శ్రేణుల్లో ఈ ఘటనపై చర్చ నెలకొంది.



తుపాను బాధితులకు అండగా ఉంటాం

